క్లుప్తంగా

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు

డీఆర్‌డీఏ పీడీ ఎస్.విజయలక్ష్మి



చెరుకుపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డులను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందించి పని కల్పించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2023–24 సంవత్సరానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. సామాజిక తనిఖీ ఆగస్టు 17న నిర్వహించినట్లు తెలిపారు. కొత్తగా పనులు గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని, ఈఓపీఆర్డీ శ్రీనివాసన్, ఎస్ఆర్పీ చిరంజీవి, పీఆర్ఏఈ ఫిరోజ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గంగడిపాలెంలో రెవెన్యూ సదస్సు



రేపల్లెరూరల్: ప్రజలు తమ భూ సమస్యలను రెవెన్యూ సభల ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. గంగడిపాలెం, చెన్నుపలివారి పాలెంలో మంగళవారం రెవెన్యూ సభలు జరిగాయి. భూ సమస్యలపై అర్జీ పెట్టుకున్న 45 రోజుల్లో పరిష్కరిస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు. పలువురు రైతులకు 1బీ పత్రాలను అందజేశారు. ఆయా గ్రామాల్లో వివిధ సమస్యలపై 24 మంది దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై 13 అర్జీలు

అమర్తలూరు(వేమూరు): రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు నెహ్రూ అన్నారు. అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు 13 అర్జీలు అందజేశారు. వీటికి త్వరగా పరిష్కారం చూపుతామని తహసీల్దారు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరు: రైతులందరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు సుశీల తెలిపారు. మండలంలోని బూతుమల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు 15 అర్జీలు అందజేశారు.

ఏసుక్రీస్తు సందేశం సదా ఆచరణీయం



భట్టిప్రోలు: ప్రేమకు, ప్రపంచ శాంతికి ఏసు క్రీస్తు సందేశం సదా ఆచరణీయమని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. క్రిస్మస్– ప్రేమ, అనురాగం, దాతృత్వానికి చిహ్నమన్నారు. భేద భావాలు లేకుండా అందరిని దగ్గరకు చేర్చే ఇష్టమైన పండగ అని తెలిపారు. క్రీస్తు జన్మించిన ఈ శుభ దినం అందరికి శాంతి సౌభాగ్యాలు కలుగ చేయాలని వేమూరు నియోజకవర్గ ప్రజలకు అశోక్‌బాబు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రార్థన మందిరాలకు అరటి గెలల పంపిణీ



కర్లపాలెం: క్రిస్మస్ పండగను పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి క్రైస్తవ ప్రార్థన మందిరాలకు అరటి గెలలను మంగళవారం పంపిణీ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల యువజన అధ్యక్షుడు చిక్కాల సాగర్, ఎస్సీ సెల్ నాయకుడు మార్పు బెనర్జి మంగళవారం అభినందనలు తెలిపారు. కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని క్రైస్తవ ప్రార్థన మందిరాలకు అరటి గెలలను పంపిణీ చేశారు. సాగర్, బెనర్జి మాట్లాడుతూ కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి గత 19 ఏళ్లుగా ప్రార్థన మందిరాలకు ఫలహారంగా అరటి గెలలు పంపుతున్నారని తెలిపారు. యాజలి సర్పంచ్ నాదెండ్ల భానుప్రసాద్, మల్లెల నాగేశ్వరరావు ఉన్నారు.

బాపట్లటౌన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే కోనరఘుపతి ఆధ్వర్యంలో కోన చారిటబుల్ ట్రస్ట్ తరపున నియోజకవర్గంలోని అన్ని చర్చిలకు ప్రతి ఏడాదిలానే మంగళవారం అరటి గెలలు పంపిణీ చేశారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి మాట్లాడుతూ 19 ఏళ్ళ నిర్విరామంగా ప్రతి చర్చికి ట్రస్ట్ తరపున అరటి గెలలు అందజేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు జోగి రాజా, కటికల యెహోషువా పాల్గొన్నారు.

క్రిస్మస్ కాంతులు

రేపల్లె రూరల్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని క్రైస్తవ దేవాలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. చర్చిలను రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు. క్రీస్తు పుట్టుకకు సూచికగా పశువుల పాకలు, బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఇవాంజలికల్ ఫెలోషిప్ చర్చి, ఏఈఎల్‌సీ చర్చి, గరువు రోడ్డులోని సెయింట్ మేరీస్ చర్చి, నల్లూరుపాలెంలోని ఏఈఎల్‌సీ చర్చిల్లో ప్రత్యేక అలంకరణలు చేశారు.

నగరం: మండలంలోని బొరమాదిగ పల్లిలోని ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చర్చి ఆవరణలోని క్రిస్మస్ స్టార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కొల్లూరు : క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లను పూర్తి చేశారు. చర్చిలు, ప్రార్థన మందిరాలు విద్యుద్దీపాల అలంకరణలో నూతన శోభను సంతరించుకున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి చేపట్టే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనేందుకు క్రైస్తవులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తమ గృహాల వద్ద పశువుల పాకలను ఏర్పాటు చేసి, సుందరంగా అలంకరించారు. క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లను ఏర్పాటు చేశారు.

భట్టిప్రోలు: లోక రక్షకుడు ఏసు క్రీస్తుకు స్వాగతం పలికేందుకు క్రైస్తవ సోదరులు సన్నాహాలు చేశారు. భట్టిప్రోలులోని క్రీస్తు రక్షకుని దేవాలయం (ఆర్‌సీఎం చర్చి– క్రీస్తు భవన్), అలాగే స్థానిక జ్యోతి నివాస్‌లో క్రీస్తు రాకకు సంబంధించిన బాల ఏసు పశువుల పాకను సుందరంగా సిస్టర్ లైసా, ఎస్తేరు తీర్చిదిద్దారు. భట్టిప్రోలు, పల్లెకోనలోని క్రీస్తు లూథరన్ దేవాలయం , ఏఈఎల్‌సీ చర్చిలను అందంగా తీర్చిదిద్దారు. రెవరెండ్ దాసరి రవివర్మ, రెవరెండ్ వై.ఆదాం పర్యవేక్షించారు.



రేపల్లెలో విద్యుత్ దీపాల అలంకరణలో ఐఆర్ఈఎఫ్ చర్చి



విద్యుత్ దీపాల వెలుగుల్లో బాపట్ల సాల్వేషన్ ఆర్మీ చర్చి



ప్రత్యేక ఆకర్షణగా స్టార్

బాపట్లటౌన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మంగళవారం రాత్రి పట్టణంలోని అన్ని చర్చిలను ఆయా కమిటీ సభ్యులు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలోని సీబీజడ్ చర్చి, సాల్వేషన్ ఆర్మీ చర్చి, దగ్గుమల్లి వారిపాలెంలోని ఏబీఎం చర్చి, ఇస్లాంపేటలోని లూథరన్ చర్చి, ప్యాడిసెన్ పేట చర్చి, ఆనందనగర్ చర్చి, మూర్తిరక్షణ నగర్‌లోని చర్చిలు విద్యుత్ కాంతులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లోక రక్షకుడి జన్మదిన వేడుకలను పట్టణ, మండలాల్లోని వివిధ చర్చిల్లో బుధవారం నిర్వహించేందుకు ఆయా చర్చీల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. క్రీస్తు పుట్టిన రోజులో భాగంగా ఆయా ప్రాంతాల్లోని ప్రార్థన మందిరాలను రంగురంగుల కాగితాలతో అలంకరించి, చర్చిల ముందు పూల తీవాచీలు పరిచారు.

భట్టిప్రోలు: లోక రక్షకుడు ఏసు క్రీస్తుకు స్వాగతం పలికేందుకు క్రైస్తవ సోదరులు సన్నాహాలు చేస్తున్నారు. భట్టిప్రోలులోని క్రీస్తు రక్షకుని దేవాలయం (ఆర్‌సీఎం చర్చి–క్రీస్తు భవన్)లో క్రీస్తు జన్మించిన పశువుల పాక ప్రదేశాన్ని కళ్లకు కట్టినట్లుగా చూపేలా బాల ఏసు అలంకరణ సిద్ధం చేశారు. సుపీరియర్ ఫాదర్ మార్టిన్, విచారణ గురువు రవికుమార్ రెడ్డి, సహాయక గురువులు బిబిన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ పశువుల పాకను తిలకించేందుకు గ్రామస్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. రాత్రి స్థానిక క్రీస్తు భవన్ నుంచి బస్టాండ్, చావలి బస్టాండ్, రథం సెంటర్ రైల్వే గేట్ సెంటర్‌ల మీదగా తిరిగారు. ట్రాక్టర్‌లో బాల ఏసును ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఓలేరు పునీతశౌరీ వారి దేవాలయాన్ని అందంగా తీర్చిదిద్ది బాల ఏసు పశువుల పాకను తీర్చిదిద్దారు. విచారణ గురువు సేవి పుదుచ్చేరి ఆధ్వర్యంలో సహాయక గురువు బెన్నీ కారుకుళం కార్యక్రమాలను పర్యవేక్షించారు.



బొరమాదిగ పల్లిలోని చర్చిలో క్రిస్మస్ స్టార్



భట్టిప్రోలులో బాల ఏసును ఊరేగింపు



విద్యుద్దీపాల అలంకరణలో కొల్లూరు లూథరన్ చర్చి



రేపల్లెలో విద్యుత్ దీపాల కాంతులతో ఏఈఎల్‌సీ చర్చి



కొల్లూరులో పశువుల పాక

పోరుబాటను విజయవంతం చేయండి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజలకు షాకుల మీద షాకులిస్తోందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. గుళ్లపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, డాక్టర్ గణేష్ మాట్లాడారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని, ప్రజలకు వాగ్దానం చేసి తీరా అధికారం దక్కగానే ఆరు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై కూటమి ప్రభుత్వం భారం మోపిందని విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలతో సామాన్యులే కాకుండా కుటీర, మధ్య తరహా పరిశ్రమలు కూడా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. గత ప్రభుత్వంలోని ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని కూటమి ప్రభుత్వం కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27న క్యాంపు కార్యాలయం నుంచి రేపల్లె విద్యుత్ కార్యాలయానికి తరలి వెళ్లి, వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు, విద్యుత్ వినియోగదారులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని గణేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు వంగరు భాను ప్రసాద్, దుండి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరి గణేష్

హైందవ శంఖారావం సభకు తరలి రావాలి

చెరుకుపల్లి: హిందూ దేవాలయాల రక్షణకు, హిందువుల ఐక్యతను తెలియజేసేందుకు జరగనున్న హైందవ శంఖారావం సభకు హిదువులు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజయవాడ శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామీజి పిలుపునిచ్చారు. జనవరి 5న విజయవాడలో సభ విజయవంతం కావాలని నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాజవోలు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. కుల, వర్గ, రాజకీయాలకు అతీతంగా హిందూ సమాజం ఏకతాటి పైకి వచ్చి హిందూ దేవాలయాలను పరిరక్షించాలని శివస్వామీజి కోరారు. సమరత సేవ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: దేవాలయాల పరిరక్షణ కోసం జనవరి 5న విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని శైవ క్షేత్ర పీఠాధిప శివ స్వామి పిలుపునిచ్చారు. తన పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన భట్టిప్రోలు విచ్చేశారు. స్థానిక రథం సెంటర్‌లోని సాయి కృష్ణ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమరసత సేవా ఫౌండేషన్ నిర్వాహకులు జంజనం హేమశంకరరావు, వేల్పూరి శ్రీనివాసరావు, చింతల మురళీకృష్ణ, బూర్లె అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామిజీ

చివరి వణుకు తీరేదెన్నడు..?

భట్టిప్రోలు: అన్నదాతకు నవంబర్, డిసెంబర్ నెలలు అంటేనే వణుకు పుడుతోంది. ఏటా ఈ 2 నెలల్లో పంట ఇంటికి చేరి దశలో వాయు గుండాలు వెంటాడుతున్నాయి. భారీ వర్షాలు సంభవించి నోటికి వచ్చిన పంట తడిచిపోవడంతో ఆవేదనతో రైతులు అల్లాడిపోతున్నారు. ఈ రెండు నెలల్లో 4 వాయు గుండాలు రైతులను వెన్నాడాయి. నైరుతీ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం తీవ్ర రూపం దాల్చి తీరాన్ని తాకడంతో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సాయంత్రం నుంచి అడపదడపా వర్షం కురవగా మంగళవారం కూడా ఆగకుండా చిరు జల్లులు పడుతూనే ఉన్నాయి. ఆరుగాలం పండించిన పొలం ఒక్కసారిగా కొరగాని పోవడంతో రైతు గుండె చెరువవుతోంది. కొన్ని చోట్ల వరి పంట నేలకు ఒరిగిపోతోంది. కోతకు వచ్చిన వరి పంట నేలకు ఒరగడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ వర్షాలు రైతులకు అగ్ని పరీక్షగా మారాయి.

అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి

వాయుగుండం ప్రభావంతో.. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని భట్టిప్రోలు ఏవో జి. మీరయ్య కోరారు. ప్రస్తుత వాతావణ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి కోతలు రెండు రోజుల పాటు నిలుపుదల చేయాలని తెలిపారు. కోసి కుప్పలు వేసిన వారికి ఎటువంటి నష్టం వాటిల్లదని ఓదెలపై ఉన్న పంటకు మాత్రం నష్టం జరిగే అవకాశం బాగా ఉందన్నారు. ఇప్పటికే మండలంలోని 11 ఎకరాల సాగులో.. సుమారు 9 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని చెప్పారు.



భట్టిప్రోలు–పల్లెకోన రహదారిలో నేల వాలిన వరి పంట

మహ్మద్ రఫీ శత జయంతి వేడుకలు

అమృతలూరు(భట్టిప్రోలు): ప్రముఖ సినీ గాయకుడు మహ్మద్ రఫీ శత జయంతిని అమృతలూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో మహ్మద్ రఫీ చిత్రపటానికి నివాళులర్పించారు. సినీ రంగంలో ప్రముఖ గాయకుడిగా ఆయన చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. హిందీ సినీ వినీలాకాశంలో అతి పెద్ద తారగా విలసిల్లి సంగీతాభిమానులందరికి చిర పరిచితుడైన రఫీ హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషలలో అనేక పాటలు పాడారని గుర్తు చేసుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంభం గిరి, కొడమూరి కృష్ణమూర్తి, షేక్ కరిముల్లా, రెడ్డి, కొల్లిపర సుబ్బారావు, వీరగంధం సాంబశివరావు, యలవర్తి సుబ్బారావు, గర్రెపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మహ్మద్ రఫీ చిత్రపటానికి అంబేడ్కర్ యూత్ నిర్వాహకుల నివాళి

చట్టాలపై అవగాహన ఏర్పరుచుకోవాలి

భట్టిప్రోలు: విద్యార్థులు చట్టాలపై అవగాహన ఏర్పరుచుకోవాలని భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చందలూరి రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు వినియోగదారుల హక్కు, రక్షణ చట్టం ఆవశ్యకతను తెలియ చేసి ప్రతిజ్ఞ చేయించారు. రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో 1986లో వినియోగదారుల చట్టం అమలులోకి వచ్చిందని 2020లో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకు వచ్చిందని తెలిపారు. న్యాయవాదుల అవసరం లేకుండా నేరుగా వినియోగదారుడు తాను ఉన్న ప్రాంతం నుంచే ఫిర్యాదు చేయవచ్చునని .....ఇందుకోసం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కన్స్యూమర్ ప్రొటెక్షన్ కమిషన్లు పని చేస్తున్నాయని చెప్పారు. నేషనల్ కన్స్యూమర్ హెల్ప్ లైన్ (ఎన్‌సీహెచ్) యాప్‌లో కూడా బాధితులు ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. 1915, 1800 114 000 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సమస్య చెబితే జిల్లా స్థాయి కమిషన్‌కు తెలియజేస్తారన్నారు. ఏదైన వస్తువు కొనేటప్పుడు బిల్లు, రసీదు ఆన్‌లైన్ పేమెంట్ చేసిన తరువాత ఇన్వాయిస్ ఐడీలను భద్రపరచుకోవాలని వివరించారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్‌ఎం రామకోటేశ్వరరావు

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

అమర్తలూరు(వేమూరు) అల్ప పీడనం ప్రభావం వల్ల మూడు రోజులు వర్షాలు కురుస్తాయని, రైతులు వరి కోతలు నిలిపి వేయాలని వ్యవసాయాధికారి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు, తురుమిళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ నెల 31లోపు రబీ పంటల బీమా చేయించుకోవాలన్నారు. ఎకరాకు మినుము రూ.60, తెల్లజొన్న రూ.38, మొక్కజొన్న రూ.105, పెసరకు రూ.36 ప్రీమియం చెల్లించాలని చెప్పారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీక్రాంత్, వ్యవసాయ సహాయకులు డి.బాలభాస్కర్, కె.శ్రీను పాల్గొన్నారు.



మోపర్రులో రైతులకు అవగాహన

క్రిస్మస్ శుభాకాంక్షలు

రేపల్లె రూరల్: రేపల్లె నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, కరుణ, ప్రేమ, దయ కలిగిన ప్రభువు మార్గం అనుసరణీయమన్నారు. సర్వజనులు ఏసుక్రీస్తు మార్గంలో పయనించాలని కోరారు. ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సౌఖ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు.

వేంకటేశ్వరుని పారాయణం

అద్దేపల్లి(భట్టిప్రోలు): అద్దేపల్లికి చెందిన బొలిశెట్టి సునీల్‌కుమార్ వేంకటేశ్వరస్వామి దీక్ష తీసుకున్న సందర్భంగా మంగళవారం స్వామి గానామృత పారాయణం నిర్వహించారు. గోవింద నామాలతో అర్ధ కాహం జరిగింది. టీటీడీ ధర్మాచారి, శుక్రవారోత్సవ ప్రధాన కార్యదర్శి బూర్లె అరుణ కుమారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారోత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.